క్లుప్తంగా

భగవద్గీత విశిష్టతపై ప్రచారం

తుని: గీతా జయంతిని పురస్కరించుకొని తుని పట్టణంలో మంగళవారం భగవద్గీత విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో భగవద్గీత ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజలకు భగవద్గీత కరప్రత్రాలు పంపిణీ చేశారు. ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు బి.శాంతరాజు, కమిటీ సభ్యులు జగన్, సత్యవతి, స్వాతి, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు బియ్యం పంపిణీ



గోకవరంలో పేద మహిళలకు బియ్యం బస్తాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రావు

గోకవరం: మండలంలో 47 మంది పేద మహిళలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. స్థానిక పీఎండీ కేఎస్‌పీపీ లే అవుట్‌లో ఒక్కొక్క మహిళకు 10 కేజీలు, 15 కేజీలు, 20 కేజీల బియ్యం బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఆపదలో ఉన్న వారికి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న లయన్స్ ప్రతినిధులు

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో మంగళవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య సేవలు పొందేందుకు వచ్చిన గర్భిణులకు స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యులు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ పౌష్టికాహార కిట్లను ప్రముఖ దంత వైద్యుడు సోమకిరణ్ సమకూర్చగా సీహెచ్‌సీ సూపరింటిండెంట్ సౌమ్యమైఖేల్ గర్భిణులకు అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్, మినర్వా వ్యవస్థాపకుడు డీవీఎస్ రమేష్‌రాజు, ఏడిద రెడ్డినాయుడు, గొంప రామకృష్ణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కాత్రావులపల్లిలో రోగులకు మందులు అందజేస్తున్న దృశ్యం

జగ్గంపేట: మండలంలోని కాత్రావులపల్లిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నెక్కంటి సీఫుడ్స్, శంకర్ ఫౌండేషన్ (విశాఖపట్టణం) సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పెద్దాపురం మండలం జె.తిమ్మాపురంలోని నెక్కంటి సీఫుడ్స్ జనరల్ మేనేజర్ గోపిచంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. కాత్రావులపల్లి, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు ఇస్తామని, కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని ప్రత్యేక బస్సుల్లో విశాఖపట్టణం తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. అనంతరం రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డీజీఎం రమేష్, కంటి వైద్యులు డాక్టర్ జి.మనాలి, డాక్టర్ డి.నిఖిత, గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, మాజీ సర్పంచి సుంకర సీతారామయ్య పాల్గొన్నారు.

దేవస్థానం కృతజ్ఞతలు



తిరుమలరావుకు స్వామివారి ఫొటో అందజేస్తున్న దేవస్థానం అధికారులు

అన్నవరం: కార్తికమాసంలో సత్యదేవుని ఆలయానికి వచ్చిన భక్తులు సత్యగిరి, రత్నగిరుల మధ్య ప్రయాణించేందుకు బస్సులను పంపించిన తిరుమల విద్యాసంస్థల అధినేత నున్న తిరుమలరావుకు మంగళవారం దేవస్థానం అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ, ట్రాన్స్‌పోర్టు గుమస్తా బీఎస్ఎస్ రాజు పశ్చిమ గోదావరి జిల్లా కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రధాన కార్యాలయంలో తిరుమలరావును కలసి ప్రశంసపత్రం, స్వామివారి ఫొటో, ప్రసాదం అందజేశారు.

పంపా బ్యారేజీకి కొత్త గేట్లు !

- విపత్తు రక్షణ నిధుల నుంచి రూ.3.36 కోట్లు విడుదల
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు
- ఎన్నికల కోడ్ కారణంగా విడుదల కాని నిధులు
- కొత్త గేట్ల ఏర్పాటుకు త్వరలోనే టెండర్లు



బ్యారేజీ గేట్లు పూర్తిగా దిగకపోవడంతో వృథాగా పోతున్న నీరు (ఫైల్)

అన్నవరం: తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో 12,500 ఎకరాలకు సాగునీరు అందించే అన్నవరంలోని పంపా బ్యారేజీకి త్వరలో కొత్త గేట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా విపత్తు రక్షణ నిధుల నుంచి రూ.3.36 కోట్లు విడుదల చేశాయి. వాస్తవానికి గత జూలై నెలలో ఇరిగేషన్ అధికారులు ఈ గేట్లను పరిశీలించారు. పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లు అమర్చాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2023 డిసెంబర్‌లో కొత్త గేట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా నిధులు విడుదల కాలేదు. ఆ తరువాత ఏర్పడిన కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ ప్రతిపాదనలను పరిశీలించి నిధులు విడుదల చేసింది.

పదేళ్లుగా మొరాయిస్తున్న గేట్లు

వాస్తవానికి భారీ వర్షాలు కురిసినప్పుడు, తుపాన్ల సమయంలో పంపా రిజర్వాయర్ నుంచి అదనపు జలాలను సముద్రంలోకి విడుదల చేసేటప్పుడు గేట్ల నిర్వహణలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో గేట్లు మార్చాలనే ప్రతిపాదన సుమారు పదేళ్లుగా ఉంది.

పంపా ప్రాజెక్టుకు 55 ఏళ్లు

అన్నవరంలో పంపా రిజర్వాయర్ నిర్మించి దాదాపుగా 55 ఏళ్లు పూర్తయింది. అప్పుడు బ్యారేజీకి ఏర్పాటు చేసిన ఐదు గేట్లకు ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేస్తున్నారు. గత ఆగస్టులో కర్ణాటకలోని తుంగభద్ర ప్రాజెక్ట్ గేటు ఊడిపోవడంతో తాత్కాలికంగా మరో గేటు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల పనితీరు పరిశీలించారు. దీనిలో భాగంగా పంపా ప్రాజెక్టును పరిశీలించిన నిపుణులు ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో గత ప్రభుత్వంలో కొత్త గేట్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం పరిశీలించి కొత్త గేట్లు ఏర్పాటుకు నిర్ణయించింది.

అర్ధచంద్రాకారంగా గేట్లు

పంపా బ్యారేజీకి 55 ఏళ్ల క్రితం గేట్లు ఏర్పాటు చేశారు. అప్పటి టెక్నాలజీ ప్రకారం అర్ధచంద్రాకారంగా (వర్టికల్) నిర్మించారు. ఆ గేట్లు కొంచెం వంగడంతో గేట్ల నిర్వహణ ఇబ్బందిగా మారింది. భారీ వర్షాల సమయంలో అదనపు జలాల విడుదల కోసం పంపా గేట్లు ఎత్తేందుకు ఇబ్బంది కలుగుతోందని అధికారులు తెలిపారు.



లీకేజీ అరికట్టేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

12,500 ఎకరాలకు నీరు

పంపా రిజర్వాయర్ కింద తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 12,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఒక పంటలో ఆయకట్టు మొత్తం సాగుకు 1.5 టీఎంసీల నీరు అవసరం. పుష్కర కాలువ నిర్మాణం జరగక ముందు పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 105 అడుగులు ఉండేది.

కొత్త గేట్ల ఏర్పాటుకు చర్యలు



పంపా బ్యారేజీకి కొత్త గేట్లు ఏర్పాటుకు గాను టెండర్లు పిలుస్తాం. గేట్లు ఏర్పాటు చేసే సమయంలో నీటిమట్టం 89 అడుగులకు తగ్గిస్తాం. అప్పుడే గేట్లు వద్ద నీరు ఉండదు. జనవరిలో కొత్త గేట్లు పనులు ప్రారంభించి ఖరీఫ్ ప్రారంభమయ్యే లోపు అంటే జూన్‌కల్లా గేట్లు ఏర్పాట్లు పూర్తి చేస్తాం.

ఈఈ శేషగిరిరావు,
పంపా రిజర్వాయర్, అన్నవరం

105 అడుగులకు నీటిమట్టం చేరితే 0.5 టిఎంసీలు నీరు నిల్వ ఉంటుంది. కాగా పుష్కర కాలువ రిజర్వాయర్ 103 అడుగుల ఎత్తులో నిర్మించిన తరువాత రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులకు అంటే 0.44 టిఎంసీకి పరిమితం చేశారు. ఇప్పుడు పంపా బ్యారేజీ గేట్లు బలహీనంగా ఉండడం వలన 99 అడుగులకే పరిమితం చేయడంతో రిజర్వాయర్ నీటి నిల్వ 0.26 టిఎంసీకి పరిమితమైంది.

గత జూలైలో తాత్కాలిక మరమ్మతులు

గోదావరి డెల్టా ఇంజినీరింగ్ చీఫ్ సురేష్ కుమార్, ఎస్ఈ జి.శ్రీనివాసరావు గత జూలై మొదటి వారంలో పంపా బ్యారేజీని పరిశీలించి గేట్ల పరిస్థితిపై చర్చించారు. వరదలు వచ్చినపుడు బ్యారేజీ గేట్ల నిర్వహణ కష్టంగా మారుతుందని ఈఈ శేషగిరిరావు ఆయనకు వివరించారు. ఈ నేపథ్యంలో గేట్లకు మరమ్మతులు చేయించాలని గోదావరి డెల్టా ఇంజినీరింగ్ చీఫ్ సురేష్ కుమార్ ఆదేశించారు. సుమారు రూ.30 లక్షలతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేశారు.

సీహెచ్‌సీని సందర్శించిన ఐహెచ్‌జీ బృందం



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చిన్నారులకు అందించే వైద్య సేవలపై సమీక్షిస్తున్న ఐహెచ్‌జీ బృందం

ప్రత్తిపాడు: చిన్నపిల్లలకు వైద్య సేవలు అందించడంలో రాష్ట్రంలోనే ముందున్న ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను ఇంటిగ్రేటెడ్ హాస్పటల్ గ్రూప్ ఆఫ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐహెచ్‌జీ) బృందం మంగళవారం సందర్శించింది. సీహెచ్‌సీలో చిన్నారుల వార్డును పరిశీలించి, అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చిన్నారులకు అందించే మరిన్ని వైద్య సేవలపై ఐహెచ్‌జీ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ వి.భరత్, జోనల్ మేనేజర్ అమీర్ తదితరులు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సౌమ్య మైఖేల్‌తో చర్చించారు. చిన్న పిల్లల విభాగం సేవలు అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన పరికరాలు, వసతులపై సమీక్షించారు. చిన్న పిల్లల విభాగాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ప్రాజెక్టు మేనేజర్ భరత్ హామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అవగాహన

శంఖవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నవరం ఎస్సై హరిబాబు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో ప్రజలకు మంగళవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫేక్ వీడియో కాల్స్‌ను లిఫ్ట్ చెయవద్దన్నారు. ఫోన్‌లో తెలియని లింక్‌లు వస్తే ఓపెన్ చేయరాదని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గిరిబాబు అడుగుజాడల్లోనే మా ప్రయాణం



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, గిరిబాబును కలిసిన అభిమానులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అడుగజాడల్లోనే మా ప్రయాణం అని జేసీఎస్ ఇన్‌చార్జి గొల్లపల్లి దొరబాబు అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఉత్తరకంచి, పెద్దిపాలెం, ప్రత్తిపాడు గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముద్రగడను, యువనాయకుడు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బొడ్డు చిన్న, ఉమ్మిడి జెమి, వాకపల్లి ధర్మరాజు, లోడ వీరబ్బు, ఉమ్మిడి బుజ్జి, ఎంపీటీసీ పిల్లా చిన్న, దేవర రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'తో రైతులకు మేలు



సోమరాయణంపేటలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ అమృత

కిర్లంపూడి: గ్రామాల్లో నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి జోకా అమృత అన్నారు. మండలంలోని పాలెం, సోమరాయునిపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఖరీఫ్ పంటలకు అడ్డులేకుండా ఈ నెలాఖరుకల్లా రబీకి వెదజల్లడం, నాట్లు వేయండం పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా వరికి ఎకరాకు రూ. 630, మినుము, పెసర పంటలకు ఎకరాకు రూ.300 చెల్లించి తమ పంటలకు ఇన్యూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఉద్యానవన అధికారి శ్రీవల్లి, వీఏఏలు శ్యామ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సారాతో ఇద్దరు మహిళల అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగిలో మంగళవారం ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది దాడి చేసి సారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి. శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సంరక్షణపై దృష్టి సారించాలి

- జిల్లా బాలల సంరక్షణాధికారి వెంకట్రావు
- రౌతులపూడిలో ఐసీడీఎస్ సిబ్బందికి శిక్షణ



ఐసీడీఎస్ సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా బాలల సంరక్షణాధికారి వెంకట్రావు

రౌతులపూడి: బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా బాలల సంరక్షణాధికారి జి.వెంకట్రావు సూచించారు. కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి ఆధ్వర్యంలో సిబ్బందికి ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. బాలికల సంరక్షణపై పలు సూచనలు చేశారు. లింగవివక్షత, సంపూర్ణ ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాలను అరికట్టడం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాలికలకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గ్రామాల్లోని బాలికల తల్లిదండ్రులను చైతన్యపరచి బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాలికలకు పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బాలికల సంరక్షణ, బాల కార్మికుల నిర్మూలనలో జిల్లాలోనే ప్రథమస్థానం పొందేవిధంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామకృష్ణయ్య, ములగపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సరోజా నవనీత్‌కుడా, రౌతులపూడి జెడ్‌పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.రాంబాబు, రౌతులపూడి, కత్తిపూడి ఐసీడీఎస్ విస్తరణాధికారులు జానకీలక్ష్మి, బీవీ రజని అంగన్‌వాడీలు, ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం



యర్రవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన జ్యోతి కళాశాలలో స్పార్ఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. మానవ హక్కులపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ సాయిసందీప్ మాట్లాడుతూ విద్యార్థులకు మానవహక్కులపై అవగాహన ఉండాలన్నారు. ఐక్యరాజ్య సమితి ఆమోదంతో ఏటా డిసెంబర్ 10న ప్రపంచ మానవహక్కుల దినోత్సవం జరుపుకుంటున్నట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.చెన్నారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నేత ఒమ్మి రఘురాం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పాలకుర్తి సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ విద్యార్థులు మానవ హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పీవీవీ సత్యనారాయణ, అకడమిక్ కో ఆర్డినేటర్ విశ్వేశ్వర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు: బార్ కౌన్సిల్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద మంగళవారం న్యాయవాదులు నిరసన చేపట్టారు. ప్రాక్టీసు చేసే న్యాయవాదులు తప్పనిసరిగా ఏడాదికి ఒక్క వకాలత్ లేదా మెమో ఆఫ్ అప్పియరెన్స్‌లు ఐదు సంవత్సరాలకు పంపించి, ప్రతి న్యాయవాది తన న్యాయవాద వృత్తిని రెన్యువల్ చేసుకోవాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాలివ్వడం పట్ల స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలు వెంటనే ఉపసంహరించుకోవాల నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ప్రతినిధులు బుగత శివ, అవసరాల దేవి, బార్ ప్రధాన కార్యదర్శి బొంగుశూరి మదుబాబు, మాజీ బార్ అధ్యక్షుడు చిటంశెట్టి పుల్లయ్య, పలివెల నాగేంద్రరాజు, రాయి శ్రీనివాసరావు, కూసుమంచి సూర్యప్రకాశరావు, జోగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా
- గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



బురదకోటలో పర్యటిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

ప్రత్తిపాడు రూరల్: గ్రామాల్లోని భూ సమస్యలతో పాటు ప్రజా సమస్యలను పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తెలిపారు. మండలంలోని బుదరకోట, బాపన్నధార, కె.మిర్తివాడ, కొండపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బురదకోట గ్రామ సభను ఆయన తనిఖీ చేశారు. రైతుల నుంచి 14 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామంలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో ఎవరూ అధైర్యపడవద్దన్నారు. గ్రామ సభలకు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పోతురాజు తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లిలో మంగళవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు, వీఆర్వో సింహచలం, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 12 అర్జీలు

కిర్లంపూడి: గ్రామాల్లోని భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జె.చిరంజీవి రైతులకు సూచించారు. మండలంలోని తామరాడ, గోనేడ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ భూ సమస్యలకు సంబంధించి 12 అర్జీలు వచ్చాయి. ఆయా సమస్యలను 45 రోజుల గడువుతో రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి పరిష్కరిస్తారని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే ఉప తహసీల్దార్ ఆర్.శ్రావణి, ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, ఆర్ఐ సత్యదేవి, సర్పంచ్ తోట అయ్యన్న, జ్యోతుల నవీన్, జనసేన జగ్గంపేట కో ఆర్డినేటర్ తుమ్మలపల్లి రమేష్, ఎంపీటీసీ గోకేడ రాజా తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మండలంలోని మర్రిపాక, ఇర్రిపాక గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇర్రిపాకలో 28, మర్రిపాకలో 15 ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ జేవీఆర్ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ నేత జ్యోతుల నవీన్ కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆనూరులో 24 దరఖాస్తులు

తొండంగి: మండలంలోని పైడికొండ పంచాయతీ ఆనూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతుల నుంచి 24 దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ మురార్జీ తెలిపారు. ఆయా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీపేట పర్యటించి స్థానికంగా సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వో కాకాడ రాజ్యలక్ష్మి, సర్వేయర్ ఎ.లవకుశరాజు పాల్గొన్నారు. మండలంలోని పి.అగ్రహారంలో బుధవారం రెవెన్యూ గ్రామసదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మురార్జీ తెలిపారు.

రౌతులపూడి: మండలంలోని రాఘవపట్నం పంచాయతీ సార్లంక, దబ్బాది, గిన్నిలారం, చల్లూరు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు 12 దరఖాస్తులు అందాయని డీటీ నరేష్ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం సార్లంకలో ఏడు, దబ్బాదిలో రెండు, గిన్నిలారంలో మూడు దరఖాస్తులు అందాయన్నారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్ఓ చందుబాబు, విలేజ్ సర్వేయర్ శివ పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

గోకవరం: మండలంలో ఈ నెల 12 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ సాయిప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12న కృష్ణునిపాలెం, 13, 17న తిరుమలాయపాలెం, 18న గోకవరం, 19న మల్లవరం, 20న కొత్తపల్లి, 21న భూపతిపాలెం, 24న కలిజొళ్ల, 26న సూదికొండ, 27న శివరామపట్నం, 28న అచ్యుతాపురం, జనవరి 2న ఠాకూరుపాలెం, 3న తంటికొండ, 4న రంపయర్రంపాలెం, 7న గుమ్మళ్లదొడ్డి, 8న గాదెలపాలెం గ్రామాల్లో రెవెన్యూ సభలు జరుగుతాయన్నారు. మండల ప్రజలు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



జి.కొత్తపల్లిలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ పోతురాజు



తామరాడలో అర్జీలు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

మండల సమావేశానికి ఎంపీటీసీల గైర్హాజరు

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. ఎంపీపీ అధ్యక్షతన జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి 24 మందికి గాను 21 మంది సభ్యులున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు హాజరుకాలేదు. దీంతో సమావేశాన్ని ఎంపీడీఓ సాయినవీన్ కుమార్ వాయిదా వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ప్రజా సమస్యలు చర్చించే అవకాశం లేనందున తాము సమావేశానికి హాజరు కాలేదని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, చిటికెల సత్యవతి తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు నేరుగా ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.

సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంపొందించాలి

తుని రూరల్: విద్యార్థుల్లో చదువుతో పాటు సాంకేతిక విద్యపై ఆసక్తిని పెంచేలా ఉపాధ్యాయులు బోధించాలని సమగ్ర శిక్ష సీఎంఓ, ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు సూచించారు. తుని మండలంలో పాఠశాలలను, భవిత కేంద్రాన్ని, పాల్ ల్యాబ్‌ను మంగళవారం కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష ఏఎస్ఓ జోగిరెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 వరకూ జరిగే సమ్మేటివ్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి సబ్జెక్టులో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం లోవ కొత్తూరు గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రశస్త యాప్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎంఈఓ ఎ.రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.